# గ్రామ్యమా? వాడుకభాషా?

విశ్వనాథ సత్యనారాయణ

....అసలు గ్రామ్యం అంటే మన పూర్వుల ఉద్దేశ్య మేమిటి? మన మేమనుకుంటున్నాము? పూర్వుల ఉద్దేశ్యం అసభ్యమైన భాష అని. కొన్ని బజారు మాటలు వలుగురు పెద్దమనుష్యుల్లో సభలలో మాటాడ రానివి వుంటాయి. అవీ పూర్వం సంస్కృతంలో కటి గల్లాలు అట్లాంటివి, ఎన్నలు ఇప్పుడు అట్లాంటివి.

సభలలో మాట్లాడేది సభ్యం...ఈ వాడుకభాష సభలలో, అది గ్రామ్యం అనేవారుకూడా మాట్లాడు తున్నారు. బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి ఉపన్యాసం రక్తిగావుంటుంది అంటే యెందుకని? వారు వాడుకభాష ప్రయోగిస్తారు. కాకుస్వని వాడుక భాషలోనే వున్నది. గ్రాంథికభాషలో కాకువు సాధించుకోవాలి. గ్రాంథికభాషావాది అన్నకొద్దీ కాకువు రమ్యత తెలియనివాడని అర్థము.

ఈ కాకువు గ్రాంథికభాషలో ఇమిడ్చేటందుకు తిక్కన్నపడ్డ కష్టం భగవంతుడికి తెలుసు. అందుకనే భాగవతం చెప్పటం కష్టం. భారతంచదవడం కష్టమనీ అంటారు. భాగవతంలో వేదాంతార్థం పెగలదు. భారతంలో కాకుస్వరం తెలియదు; అది తెలియకనే భారతంలో ఏముంది అంటారు కొందరు.

కాకువు అంటే భావద్యోతకానికి ఉచ్చారణలో చూపే ఒడుపు ఒక భాషా సామర్థ్యం ఆ భాషలో కాకు ధ్వనిని పట్టి తెలుస్తుంది. ఆ కాకు ధ్వనిని గ్రాంథికభాషకన్నా వాడుకభాష మిక్కిలిగా ప్రయోగిస్తుంది. వాడుకభాషా అంటే ప్రత్యయాల మార్పు మాత్రమేగా అనుకోవచ్చు. నేటి కొందరు కవులభాష ప్రత్యయాలు మారిస్తే, వాడుకభాషకన్న అమిత కనాకష్టం అవుతుంది. ఏ శ్రీనాథుడి కవిత్వమో ప్రత్యయాలుమారిస్తే దానికి గ్రామ్యత్వం సిద్ధించదు.

ఈ వాడుకభాష ఎందుకు వద్దు అంటే పండితులు చెప్పే కారణాలు ఏమిటంటే ఇందులో శబ్దాలు యిష్టం వచ్చినట్లుగా మారుతున్నవి. ఆ మార్పుకు హద్దులేదు. అందువల్ల గ్రాంథికభాష మారిపోతుంది అని. మార్పుకు హద్దులేదూ అంటే హద్దువున్నది. గోడని ఎవ్వరూ 'గడ' అనరు. 'చూడడం' 'చూట్టం' అవుతుంది. 'ఒక్కరికదు' యూనై రూపాలు వ్రాసిన వ్యాకరణం ఈమాత్రం చెయ్యలేదూ?

బ్రహ్మశ్రీ అచంట సాంఖ్యాయన శర్మగారు మన దేశానికి భీష్ములవంటివారు. వారు అన్నారుగదా, 'ఈ క్రొత్తభాషవల్ల భారతభాగవతాలు మూలపడతవి' అని. ఈ భాషవల్లనే అట్లాజరిగేటట్టయితే అదియిదివరకే జరగాలి. బొబ్బిలిపాటలు, కామమ్మకథలు, రామదాసు కీర్తనలు, కొంతదాకా త్యాగరాయ కృతులూ ఇవన్నీ వాడుకభాషలోనే వ్రాయబడ్డవి. అన్నీ అచ్చుపడ్డవి. దానివల్ల భారత భాగవతాలకు వచ్చిన నష్టంలేదు అన్నా.

ఈ భాష చదివితే పిల్లలు పాడయిపోతారు అన్నారు. ఈ యూనివర్సిటీవారూ, గవర్నమెంటు వారూ పెట్టే గ్రాంథిక నాటక గ్రంథాలవల్ల పాడవు తారేగాని, శక్తిగల జీవంగల నుడికారం ప్రయోగించిన వాడుక భాషాగ్రంథాలు చదివితే చెడిపోరు అంటాను.

భాష స్వభావం తెలుసుకోకుండా గ్రంథస్థ భాషలోవున్న ప్రత్యయాలకిమాత్రమే ఆగౌరవంకలిపిస్తే దానివలన భాషకి చాలా నష్టం వుంది. పిల్లలకి అటు వంటి భాష నేర్పరాదు. ఆ భాష తగినంత జీవంగల భాష అయివుండాలి. నిర్జీవమైతే గ్రాంథిక భాష అయినా పిల్లలకు నేర్పకూడదు. గ్రాథికభాష అన్న పేరుతో తప్పురూపాలు కోటానుకోట్లుగా వున్న భాష (ఇప్పటి స్కూళ్లలోపెట్టే పుస్తకాల భాష) వాళ్లకి నేర్పరాదు. సామాన్యంగా పిల్లలచేత నేడు స్కూళ్లలో చదివించే నవలలూ అన్నీనీ కుఱ్ఱ వాడికి భాషలోవుండే శక్తిని తెలియనియ్యడంలేదు. భాషశక్తి కారంకలో, కాకువులోనూ, హృదయోద్వేగం ప్రకటించే మాటల్లోనూ వుంటుంది. ఆ శక్తి తిక్కనరచనలలో సమృద్ధిగా వుంది. కొందరి కవుల్లో అది కనపడనే కనపడదు.

'వచ్చుచున్నది', 'వస్తున్నది', 'వస్తోంది' అన్న రూపాల దగ్గరకాదు తగాదా. బాహుళ్యంమీద, భాషాస్వభావంమీద. ఈ రూపాలన్నీకూడా వాడికి తెలియవలసిందే. అవి వాడేచోట్లు వేరుగావుంటవి. పసిపిల్లలకి చెప్పే చిన్ని చిన్ని కథల్లో 'వస్తోంది' అని వాడవచ్చు. యింకేదైనా అయితే 'వస్తున్నది' అన వచ్చు. 'వచ్చుచున్నది' గ్రాంథికభాషా రూపం తెలిసేటందుకు.

మనభాషలోకి యితరదేశ్యాలు యథేష్టంగా ప్రయో గించవచ్చు. 'ఖీలు'కూడా భాషలోకివచ్చింది. 'సప్లయి'

ముక్కలైనవి శబ్దరత్నాకరంలోనే వున్నవి. 'వస్తాడు' అన్నది నింద్యగ్రామ్యం. ఇది యెట్లావుందంటే, దొర గారితో కలిసి 'టీ' త్రాగవచ్చుకాని పంచముణ్ణి దగ్గరకు రానీయరాదు. మహమ్మదీయుడికి కూడ మర్యాద వచ్చింది. దొరకి దొర మర్యాదే సిద్ధించింది. మాలవాడికి?

భాష ప్రవాహిని మారుతూ వుంటుంది. కనుక మారే భాషని పట్టుకోటానికి వీలులేదు అని భాషా వాదులతర్కం. దీనికొక పండితులు చక్కని అభ్యంతరం చెప్పారు. ఏమనిఅంటే అవును మారటం స్వభావం, ప్రకృతిలో ఆదోషం వున్నది. ఆ దోషం తీసివేసేందుకే మేము దాన్ని యిట్లావుండాలని నిశ్చయించాము. దాన్ని సూత్రబద్ధంగా చేశాము అని. ఇది బాగుంది. కాని సూత్రబద్ధం చేయకముందు ఆ భాషయొక్క పరిణామానికి, దానివైశాల్యానికి ఎడమిచ్చిచెయ్యాలా? వద్దా! కుర్రవాణ్ణి అల్లరి చిల్లరగా తిరగనీయవద్దు. అయిదయింతరువాత, వాడు ఆడుకోవద్దూ? యింట్లో అదేపనిగా కూర్చుంటే గుదులెత్తి బోదకాళ్ళు వస్తవి. మన భాషకిదివరకే బోదకాళ్ళు వచ్చినై. కొంచెంకాలు సాగనివ్వాలి.

మార్పుకోసమే మార్పుకాదు. వాడుక భాషలో చెప్పేకొన్ని భావాలు సరిగా తెలియ చెయ్యటానికి గ్రాంథిక భాషకి సామర్థ్యం చాలదు అని, పూర్వం నన్నయ్యగారు నిబంధించిన నిబంధన చాలకనే భాష యింతగా మారిపోయిందని, కనక ఆ సామర్థ్యం ఎంత వరకువుందో అంతవరకూ వదలిపెట్టవలెనని అప్పుడు దానికి సూత్రాలు నిర్మించు. నీ సూత్రాలు దాటడెవ్వడూను.

అట్లా అయితే వాడుకభాషకే సామర్థ్యంచాలదు. వాడుకభాష వాడుకలోవున్న భావాలని మాత్రమే చెబుతుంది. గ్రాంథికభాషలో మనకు వాడుకలోలేని భావాలు చెప్పవలసి వస్తుంది. పైగా గ్రాంథిక భాషకి అటువంటి భావాలతోనే యెక్కువ పనివుంటుంది. అని అన్నారు. అవును ఆ భాషాసామర్థ్యము ఆభాషది. ఈ భాషా సామర్థ్యం యీ భాషది. రెండునూ కావలయుననే నా వూహ.

నిజమైన మాటకి పద్యము, గద్యము రెండేమార్గాలు. మూడవది పాట ఏభాషలోనైనా వుండవచ్చు. పద్యము గ్రాంథిక భాషలో వుండాలి. గద్యము వాడుకభాషలో వుండాలి. పద్యము ఎందుకు గ్రాంథిక భాషలో వుండాలి అంటే, ఛందోబద్ధమైన భాషకు పద్యమూ, పద్యానికి ఛందోబద్ధమైన భాషా సరిపోయినవి. ఇది వరకు మనవాళ్లు సృష్టించి యేర్పరచిన వృత్త భేదాలు గ్రాంథిక భాషా స్వరూపానికి తగి పోతివి. వాడుక భాషలోనే పద్యాలు వ్రాయాలి అంటే, ఆ వృత్తాలు మారాలి.

వచనంలో వాడుక భావాలు చెప్పటానికి వాడుక భాష కుదిరినట్లుగా గ్రాంథికభాష కుదరదు. వాడుకలో లేని భావాలకు గ్రాంథిక భాష కుదరవచ్చు. మిక్కిలి వాడుకలో వుండే భావాలు ఆ భాషలో చెప్పటం పరమ అసహ్యం.

ప్రాంతీయ శబ్దాలు అని తోసివేయటం గ్రాంథిక భాషచేయదు. ఆ విషయంలో గ్రాంథికభాష భాషా వైశాల్యం పరిగణించిందన్నమాట. అట్లా తప్పు పట్టుకుంటే వాడుకభాష తన వైశాల్యం సంకుచిత పరచుకుంటోంది అని అర్థం. ప్రాంతీయశబ్దాలు భాషాదేవి విస్తారమైన తనువు. అవి తీసేస్తే ఆవిడ గుజ్జుఅయిపోతుంది. కావలిస్తే ప్రాంతీయశబ్దాల పట్టికలు ఇవ్వవచ్చును...

(జయంతి 1927 పత్రికనుండి)